ఇసుక స్టాక్ పాయింట్‌లో అక్రమాలు

ఉచిత ఇసుక పేదలకు అందని ద్రాక్షలా మారింది. ఇసుక స్టాక్ పాయింట్‌లో ట్రిప్పు ఇసుక కోసం ట్రాక్టర్, టిప్పర్ లారీ డ్రైవర్లతో పాటు వినియోగదారులు పడరానిపాట్లు పడాల్సి వస్తోంది. స్టాక్ పాయింట్‌లో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇసుక లోడింగ్ విషయంలో కొందరు వాహనదారులు అధికార పార్టీ నాయకుల నుంచి పైరవీలు చేయిస్తుండగా... మరి కొందరు స్టాక్ పాయింట్‌లో సిబ్బందికి ముడుపులు చెల్లించి తమ వాహనాలకు ఇసుక లోడ్ చేసుకుంటున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన వివిధ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు.

– దొరవారిసత్రం



మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్‌లో లారీలో ఇసుక లోడ్ చేస్తున్న జేసీబీ

- ఓ వైపు పైరవీలు.. మరో వైపు ముడుపులు
- ట్రక్కు ఇసుక కోసం 24 గంటలకు పైగా పడిగాపులు
- చోద్యం చూస్తున్న అధికారులు



స్టాక్ పాయింట్‌లో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు వాదోపవాదాలు



ఇసుక కోసం రహదారి వెంబడి బారులుతీరిన వాహనాలు

మండలంలోని మావిళ్లపాడులోని ఇసుక స్టాక్ పాయింట్‌లోని ఇసుక కోసం వినియోగదారులు సూళ్లూరుపేట, ఓజిలి, తడ, డీవీ సత్రం తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లతో అధిక సంఖ్యలో వస్తున్నారు. ట్రిప్పు ఇసుక కోసం రోజుల తరబడి క్యూలో డ్రైవర్లు వాహనాలతో ఉండాల్సి వస్తోంది. అయినప్పటికీ ఒక ట్రిప్పు ఇసుక తోలుకోలేకపోతున్నామని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వాహనదారులు అధికార పార్టీ నాయకుల నుంచి సిఫార్స్ చేయించుకుని రోజులో 2–3 ట్రిప్పులు తోలుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా స్టాక్ పాయింట్‌లో ఉన్న వివిధ శాఖల సిబ్బందికి కొందరు వాహనదారులు ముడుపులు చెల్లించడమే కాకుండా వారికి అవసరమైన ఆహార పదార్థాలు తెచ్చిస్తూ రోజులో రెండు ట్రిప్పులకు తగ్గకుండా ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం. ఇసుక లోడింగ్ పాయింట్‌లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేలా రెవెన్యూ, సెబ్, పోలీస్, మండల పరిషత్ అధికారులను నియమించారు. వారు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై డ్రైవర్లు, పాయింట్‌లోని సిబ్బందికి మధ్య అనుదినం వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. గురువారం రోజు కూడా క్యూలో ఉన్న వాహనాలకు స్లిప్స్ విషయంలో తారుమారు కావడంతో వాహనదారులకు పోలీస్, రెవెన్యూ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. ఇసుక కోసం వచ్చే వందల ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో ట్రిప్పర్లు రహదారిపై బారులు తీరుతున్నాయి. ఇసుక పాయింట్‌లో ఒక్క యంత్రమే లోడింగ్ చెయ్యడం వల్ల చాలా ఆలస్యం అవుతుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించి మరో యంత్రాన్ని ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్‌లో జరిగే అక్రమాలపై విచారించి చర్యలు తీసుకుంటాం. వాహనాలు అడ్డదిడ్డంగా కాకుండా క్యూలో వచ్చే విధంగా చూస్తాం. పాయింట్‌లో అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకే వివిధ శాఖల అధికారులకు నియమించాం.

– చంద్రముని, సూళ్లూరుపేట ఆర్డీవో

అక్రమాలు అవాస్తవం

మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్‌లో ఎలాంటి అక్రమాలు జరగడంలేదు. క్యూలో ఉన్న వాహనాలకే ఇసుకను లోడింగ్ చేస్తున్నాం. మా సిబ్బంది ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పనులు చేస్తున్నారు. కొంతమంది కావాలనే తమపై ఆరోపణలు చేస్తున్నారు.

– జి.నాంచారయ్య, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్ తహసీల్దార్, మావిళ్లపాడు

క్యూలో పెట్టి 24 గంటలైంది



ఇసుక కోసం స్టాక్ పాయింట్ వద్ద ట్రాక్టర్ పెట్టి 24 గంటలైంది. పాయింట్ వద్దనే రోజుల తరబడి ఉండాలంటే ఎలా. స్టాక్ పాయింట్‌లో ఉన్న సిబ్బంది వాహనదారుల నుంచి మామూళ్లు తీసుకుని మాకంటే వెనుక వచ్చిన ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేస్తున్నారు. ఇది అన్యాయం.

– కె.చెంగయ్య, ట్రాక్టర్ డ్రైవర్, కుప్పారెడ్డిపాళెం

అక్రమాలను అడ్డుకునే వారులేరు



మావిళ్లపాడు ఇసుక స్టాక్ పాయింట్‌లో పలు అక్రమాలు జరుగుతున్నా పట్టించుకునే వారులేరు. స్థానికంగా ఉన్న అధికారులు నోరు మెదపడంలేదు. దీంతో పాయింట్‌లో ఉన్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనాలు రోజుల తరబడి ఉండాల్సి వస్తోంది.

– టి.గురవయ్య, ట్రాక్టర్ డ్రైవర్, అక్కరపాక

నేటి నుంచి సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సైదాపురం: మండలంలోని కలిచేడు గ్రామ సమీపంలో వెలసిన కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవదాయశాఖ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి అంకురార్పణ, శనివారం ఉదయం ధ్వజారోహణం, ఆదివారం అభిషేక పూజలు, నంది వాహన సేవ నిర్వహిస్తామన్నారు. సోమవారం ఉదయం స్వామి వారిని గజ వాహనంపై ఊరేగిస్తామన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త తెనాలి రవికుమార్, నూనె బ్రదర్స్, గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం, అదేరోజు సాయంత్రం పల్లకి సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞ కుమారకృష్ణ యాచేంద్ర ఆధ్వర్యంలో పార్వేట ఉత్సవం చేపడతామని తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

తడ: శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పని చేస్తున్న తునికి చెందిన సతీష్ కుమార్‌పై ఈ నెల 16వ ఇనుప రాడ్డుతో దాడి చేసి గాయపరిచిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.నరసింహారావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడకు చెందిన నీలపు రవీంద్రబాబు భార్య ఇద్దరు పిల్లల్ని వదిలేసి సతీష్‌తో వచ్చేసింది. దీంతో అతను ఆమె తడలో ఉన్నట్టు గుర్తించి ఇక్కడికి వచ్చాడు. ఆమెను తనతోపాటు తీసుకువెళ్లాలని ప్రయత్నించాడు. సతీష్ ఉంటే ఆమె రాదన్న ఉద్దేశంతో అతన్ని చంపేయాలని భావించాడు. ఈ క్రమంలో బంధువు అల్లం దుర్గా ప్రసాద్‌తో కలిసి 16వ తేదీన సతీష్‌పై ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపరిచారు. సతీష్ తమిళనాడులోని ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు సమాచారం. నిందితులు తడ వెటర్నరీ హాస్పిటల్ ప్రాంతంలో ఉన్నట్టు అందిన సమాచారంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. దాడికి ఉపయోగించిన ఇనుప రాడ్డును చెట్ల పొదల్లో ఉండగా స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను గురువారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

తడ: మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న మురళీకృష్ణ అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో ఈవోపీఆర్‌డీగా ఉన్న విజయ్‌కుమార్‌కి ఉన్నతాధికారులు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని మధురెడ్డి కాలనీకి చెందిన పేదలకు గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు క్లబ్ మెంబర్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు అధినేత కంఠి రామోహన్‌రావు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇందులో భాగంగానే వారి తల్లి సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాసిన నాగులు, సభ్యులు గిరిబాబు, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, వాసు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

దక్కిలి : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఈవోపీఆర్డీ అల్లాబక్షు తెలిపారు. ఆయన గురువారం సిబ్బందితో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంతోపాటు సమీపంలో నిల్వ ఉన్న చెత్తను తొలగించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దక్కిలి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య శిబ్బంది

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. పెళ్లకూరు మండలానికి చెందిన చాగణం లలితమ్మ, భాస్కరరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేసి కళ్ల అద్దాలు అందించారు. అలాగే ఎంపికైన వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామని తెలిపారు. ఏఓ గల్లా క్రిష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్టాప్ డయేరియా కార్యక్రమం

తడ: రాష్ట్రంలో డయేరియా ప్రబలి ప్రాణాంతకంగా మారుతున్న నేపథ్యంలో అధికారులు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా గురువారం తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో మల్లికార్జునరావు, తడ పీహెచ్‌సీ వైద్యులు కిషోర్ వైద్య సిబ్బందితో కలిసి కేజీబీవీ, బాలుర హాస్టళ్లను పరిశీలించారు. పారిశుద్ధ్యం, నీరు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

విద్యా సామగ్రి అందజేత

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని ఆటకానితిప్ప ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 28 మందికి గురువారం ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకుడు ఎం.ఎం చంద్రబాబు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎంఈవో–2 శ్రీనయ్య, పాఠశాల హెచ్‌ఎం రేవతి, పాఠశాల చైర్‌పర్సన్ కుయిల్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

చిల్లకూరు : విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం పెట్టాలని ఈవోపీఆర్‌డీ మాణిక్యం ఆదేశించారు. ఆయన గురువారం చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్యం మెరుగుపరిచాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని సూచించారు.

సకాలంలో బియ్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

దక్కిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్‌కార్డుల దారులకు సకాలంలో సరుకులు ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం రేషన్ షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 13,500 రేషన్‌కార్డులు ఉన్నాయని చెప్పారు. అందులో ఇప్పటి వరకు 2,500 మందికి సరుకులు ఇవ్వలేదన్నారు. రేషన్ లైజేషన్‌లో జరిగిన పొరపాట్ల వల్ల వినియోగదారులు నష్టపోతున్నట్లు చెప్పారు. కొన్ని గ్రామాల్లోని రేషన్‌కార్డులు పక్క పంచాయతీలకు మ్యాపింగ్ కావడంతో సకాలంలో సరుకులు అందడం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమన్వయతో పని చేసి సకాలంలో సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలకు నీటి శుద్ధి యంత్రం వితరణ



వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చిల్లకూరు : గూడూరుకు చెందిన రొటేరియన్ మునిగిరీష్, ఆయన సోదరుడు మునిభాస్కర్ తమ తండ్రి జ్ఞాపకార్థ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ 30 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను గురువారం చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ సభ్యుడు బీవీ శ్రీధర్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలోనే పాఠశాలలో గతంలో ఉపాధ్యాయుడిగా పని చేసి మునిభాస్కర్‌ను కొంతమంది వాటర్ ప్యూరిఫయర్‌ను ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. దీంతో ఆయన తన తండ్రి జ్ఞాపకార్థం వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రొటేరియన్లు పి.దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, మయూరిశ్యాం, కిరణ్‌చక్రవర్తి, హరిప్రసాద్, మల్లయ్య, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో వసతుల కల్పనకు కృషి



క్రీడా స్టేడియంలో ఉన్న వ్యాయామ పరికరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ క్రీడా మైదానంలో వాకర్స్, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. వ్యాయామ పరికరాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఉదయం మహిళలు, చిన్న పిల్లలు, వాకింగ్ చేసే సమయంలో అలసట తీర్చుకునేందుకు బెంచీలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు వేగూరు రాజేంద్ర తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎంలు, ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు : విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండ్ల సుధాకర్ తెలిపారు. జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు సహకారంతో నోట్ పుస్తకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత శ్రీనివాసులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సైదాకుమారి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజేంద్ర, మాధవయ్య, ట్రస్టు ప్రతినిధులు బాబు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

నాయుడుపేట టౌన్ : మండలంలోని మేనకూరు వద్దనున్న హిందుస్థాన్ నేషనల్ గ్లాస్ పరిశ్రమ సమీపంలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. న్నాయి. ఈ ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన రామాంజనేయులు (24) నాయుడుపేటలో ఉంటే మేనకూరు సెజ్‌లోని ఇండూస్ కాఫీ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని అక్కడ పనిచేసే హేమచంద్రతో కలిసి బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. హిందు స్థాన్ నేషనల్ గ్లాస్ పరిశ్రమ సమీపంలో మరోబైక్ ఢీకొంది. రామాంజనేయులు, హేమచంద్ర, మరో బైక్‌లో వెళుతున్న నాయుడుపేటలోని బేరిపేటకు చెందిన తేజ, దొరవారిసత్రం మండలం మైలాంగం గ్రామానికి చెందిన అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో నెల్లూరు తరలించారు. మార్గమధ్యంలో రామాంజనేయులు మృతిచెందాడు. అశోక్, తేజ, హేమచంద్ర చికిత్స పొందుతున్నారు. సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ గోపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

తడ: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మరణించిన సంఘటన గురువారం తెల్లవారుజామున స్థానిక రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. ఒక మహిళ గురువారం తెల్లవారుజామున తడ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్ 1 నుంచి ప్లాట్‌ఫాం 2కి వెళ్లేందుకు ట్రాక్ దాటుతోంది. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహం ఛిద్రమైంది. శరీరభాగాలను సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు. ఆమె తమిళనాడుకు చెందిన మహిళ కావొచ్చని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. చూకీ తెలిసిన వాళ్లు సూళ్లూరుపేట జీఆర్‌పీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు అధికారులతో సమావేశం

ఓజిలి: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరవుతారని, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

గురువులకు ఘన సత్కారం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ముందస్తు గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆత్మబోధ గురువులను సత్కరించారు. నాయుడుపేట మండలం పూడేరు గ్రామానికి చెందిన ఆత్మబోధ గురువు అద్భుతానందస్వామి(రామయ్య) పంచీకరణ పంచ భూతాలపై తత్వ బోధన చేశారు. రాత్రి ఆలయం వద్ద దాతల సహకారంలో అన్నదానం చేశారు. చిట్టమూరు, అగ్రహారం, ముట్టెంబాక, వాకాడు, గునపాటిపాళెం, కోటపోలూరు, వెంకటరెడ్డిపాళెం, పల్లిపాళెం, తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నాయుడుపేట టౌన్ : నూతన బోధన విధానాలపై గూడూరు డివిజన్ పరిధిలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు గురువారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ ప్రారంభించారు. రాష్ట్ర పరిశీలకులు అపర్ణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, కోర్సు డైరెక్టర్లు ఎం శాంతి, నోడల్ అధికారి బి.మునిరత్నం, రిసోర్స్ పర్సన్లు మహేష్, రాజా, రమణయ్య, మధుకర్, ప్రదీప్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

సామాజిక తనఖీపై గ్రామసభ

చిల్లకూరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24లో చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందాలు నాలుగు రోజులుగా పరిశీలిస్తున్నారు. తనిఖీలు పూర్తికావడంతో గురువారం లింగవరం గ్రామంలో సర్పంచ్ నావిన సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎస్‌ఆర్‌పీ రవి మాట్లాడుతూ గ్రామంలో వివిధ పనులకు రూ.39 లక్షలు ఖర్చు చేశారని తెలిపారు. అందులో కూలీలకు నగదు పూర్తిగా అందిందా.. ఇంకా ఎవరికైనా బకాయిలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి హత్య కేసులో ముమ్మర దర్యాప్తు

నాయుడుపేట టౌన్ : దొరవారిసత్రం మండలం నెలబల్లి అటవీ ప్రాంతంలో చిన్నారి(8)పై లైంగిక దాడి చేసి హత్య చేసిన కేసులో ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహన్, దొరవారిసత్రం ఎస్‌ఐ తిరుమలరావు గురువారం నాయుడుపేట ఆస్పత్రి వద్ద ఉన్న బీహార్ ప్రాంతానికి చెందిన వారితో పాటు హత్య చేసిన యువకుడి తండ్రిని విచారించారు. అనంతరం చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతున్న 18 మంది పిల్లలు

నాయుడుపేట టౌన్ : స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 150 మంది విద్యార్థుల్లో 132 మంది కోలుకుని ఇళ్లకు వెళ్లినట్టు అధికారులు తెలిపారు. నెల్లూరు జీజీహెచ్‌లో 12 మంది చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టినట్టు తహసీల్దారు కల్యాణి తెలిపారు. నాయుడుపేటలో ఇద్దరు, సూళ్లూరుపేటలో ఇద్దరు, శ్రీకాళహస్తిలో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నట్టు పేర్కొన్నారు.

శంకర్‌రెడ్డి మృతి తీరని లోటు



శంకర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరి రూరల్ : ఆర్టీసీ రీజనల్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చెలికం శంకర్ రెడ్డి(89) మృతి తీరని లోటని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చెలికం శంకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని శంకర్‌రెడ్డి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేదురుమల్లి మాట్లాడుతూ శంకర్‌రెడ్డి తమ కుటుంబంతో 40 ఏళ్లగా అనుబంధం ఉందన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనతోపాటు ఉండి అహర్నిశలు శ్రమించారని తెలిపారు. అనంతరం శంకర్‌రెడ్డి సతీమణి చెలికం చెలికం జయమ్మను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధురెడ్డి, వెంకటగిరి, డక్కిలి జేసీఎస్ కన్వీనర్లు పులి ప్రసాద్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు నివాళులర్పించారు.



పేచీరాజ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

పేచీరాజ్‌కు నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరి రూరల్ : ఇటీవల టీడీపీ నేతల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న పేజీరాజ్‌ను వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన గురువారం పేచీరాజ్ నివాసం వద్దకు చేరుకుని ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. జేసీఎస్ కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధురెడ్డి అమ్మపాళెం సర్పంచ్ మస్తాన్, నాయకులు తోట గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



వెంకటగిరి రూరల్ : హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి అనూష

గూడూరు రూరల్ : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గూడూరు కోర్టు ఏడవ అదనపు జిల్లా జడ్జి సుల్తానా బేగం తెలిపారు. ఆమె గురువారం కోర్టు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులతో కలిసి కోర్టు సెంటర్ నుంచి ఒకటో పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వరకు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. సబ్ జడ్జి లోకనాథం, జయలక్ష్మి, గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ

కోట : హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రమాదాల బారిన పడినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ తెలిపారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు కోటలో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్ : వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం పోలీసులు, న్యాయవాదులతో కలిసి హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ న్యాయవాది కె.జే ప్రకృతి కుమార్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి రూరల్ : ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. హెల్మెట్ వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు నుంచి కాశీపేట కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. పీనల్ న్యాయవాది అద్దంకి గాంధీ, రాజేష్, ఎస్‌ఐ జిత్యానాయక్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సంయుక్త తెలిపారు. ఆమె గురువారం పీపీ స్వాతిరెడ్డి, సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐలు, పోలీసులు, న్యాయవాదులతో కలిసి హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. బార్ అసోసియేష్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, కార్యదర్శి వీరాస్వామి, న్యాయవాదులు చదలవాడ కుమార్, జీవీఎల్‌కే కిషోర్, పసల చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

పెళ్లకూరు: ఇంటి నుంచి అదృశ్యమైన మహిళ ఉరివేసుకుని మరణించడం గురువారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని శిరసనంబేడు రాజుపాళెంకు దొమ్మరాజు సరసమ్మ(60)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. కొన్నిరోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త సుబ్రమణ్యం గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో అటవీ ప్రాంతంలో ఒక చోట దుర్గంధం వెదజల్లుతుండడంతో పశువుల కాపరులు పరిశీలించారు. చెట్టుకు ఉరి వేసుకుని మహిళ మరణించి, కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం ఉండడాన్ని గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు సరసమ్మగా తేలింది. మృతదేహం ఉన్న స్థితి బట్టి పదిరోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహానికి అక్కడే పంచనామా చేసి ఖననం చేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.